తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా


దర్నా చేస్తున్న కాలనీవాసులు

కీసర: మేడ్చల్ జిల్లాలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల డబుల్ బెడ్‌రూం కాలనీ వాసులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. చీర్యాల డబుల్‌బెడ్‌రూం గృహస ముదాయాల వద్ద సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నాయని, కానీ డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సరఫరా తదితర సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రిలే నిరాహార దీక్షలు



ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు పూర్తి చేయాలని కోరుతూ మంగళవారం ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకుంది. ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, సుధాకర్‌రెడ్డి దీక్ష చేపట్టగా ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలుపగా ప్రమోద్‌గుప్త, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సత్తి, యాదగిరి, మురళీగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు


కేక్ కట్ చేస్తున్న దివ్యాంగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్

జవహర్‌నగర్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ ఎన్టీఆర్ కాలనీలో దివ్యాంగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది గడుస్తున్నా దివ్యాంగులకు రూ.6 వేలు ఫింఛన్ ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, శ్రీను, ధన్‌రాజ్, మహేష్, రమేష్, అంకిత, సిద్దమ్మ స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా యశ్వంత్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నూతన ఏఈగా యశ్వంత్ మంగళవారం బాధ్యత స్వీకరించారు. కాగా ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన బలరాం నాయక్‌ను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులు నేరుగా పట్టుకున్నారు. దీంతో సీఎండీ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న యశ్వంత్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఏఈ మాట్లాడుతూ.. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

బోడుప్పల్: నగర అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, ఎస్‌హెచ్‌జీ మహిళాస్టాల్స్, ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం స్కూల్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. స్వచ్ఛ బోడుప్పల్ దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, రాసాల వెంకటేష్‌యాదవ్, సుమన్‌నాయక్, కొత్త దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే విజయోత్సవాలు అని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు రజితాపరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్, బొంతు శ్రీదేవిలతో కలసి మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఉచితబస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. దేశంలోని ఏ ప్రభుత్వం చేయని విధంగా ఏకంగా రూ.21 వేల కోట్లతో రుణమాఫీ చేశామని వివరించారు. ప్రతి కార్యకర్త నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పర్యటించి కరపత్రాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 200 కోట్ల నిధులిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నేతలు కంది ఆగిరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, తౌఫిక్, సుధాకర్‌రెడ్డి, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, తెలకల మోహన్‌రెడ్డి, తవిడ బోయిన గిరిబాబు, సీతారాంరెడ్డి, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో వజ్రేశ్‌యాదవ్, చైర్‌పర్సన్ పావనీజంగయ్య


నాగారం అర్బన్ డే ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి


శామీర్‌పేట్‌లో.. స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులతో 2కే రన్


మేడ్చల్‌రూరల్‌లో.. ప్రజాపాలన విజయోత్సవాల్లో నాయకులు, అధికారులు, సిబ్బంది

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు


దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 2కే.రన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు

ఘట్‌కేసర్: పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, కమిషనర్ చంద్రశేఖర్ హాజరై బస్ ప్రయాణ ప్రాంగణం నుంచి అంబేడ్కర్ చౌరస్తా, శివారెడ్డిగూడ వరకు ప్రజాపాలన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కౌన్సిలర్ రవీందర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, వెంకటేష్‌ముదిరాజ్, నాయకులు అంజిరెడ్డి, ఆంజనేయులు యాదవ్, సంజీవరెడ్డి, మాధవరెడ్డి, జంగయ్యయాదవ్, నరేష్‌గౌడ్ మల్లేష్‌యాదవ్, ఫరూక్, శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కీసర: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం రోజున నాగారం మున్సిపాలిటీలో అర్బన్ డే కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటలకు ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులతో కలిసి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ నుంచి ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ వరకు అర్బన్‌డే ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు, పీపీఈ కిట్లను పంపిణీ చేసి అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులకు రూ. 2 కోట్ల 36 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్ యాదవ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మహిళా సంఘం మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..

ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని కుందన్‌పల్లిలోని వైజాగ్ డిఫెన్స్ అకాడమీ నుంచి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వరకు 2కే.రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి పాల్గొన్నారు. అనంతరం సాయిభవానీ ఫంక్షన్‌హాల్‌లో బస్తీ దవాఖాన ఆసుపత్రి డాక్టర్స్‌తో మున్సిపల్ సిబ్బందికి హెల్త్ క్యాంప్ నిర్వహించి ఏఎన్‌ఎంలను ఘనంగా సత్కరించారు. మహిళా సంఘాలకు రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్‌లో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు మున్సిపాలిటీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ స్వామి డ్వాక్రా మహిళలకు రూ.1.30 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, మల్లిఖార్జున్ ముదిరాజ్, బాలరాజ్, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో..

మున్సిపాలిటీ పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జోడిమెట్ల చౌరస్తా నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయించారు. విజయోత్సవాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి చైర్మన్ కొండల్‌రెడ్డి చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో..

ప్రజాపాలన విజయోత్సవాలు తూంకుంట మున్సిపాలిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో రూ. 96 లక్షల నిధులతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి ఎస్‌హెచ్‌జి బ్యాంకు లింకేజీతో 13 మహిళా సంఘాల సభ్యులకు రూ. 1.40 లక్షల చెక్కులతో పాటు 40 స్ట్రీట్ వెండర్లకు రూ. 14 లక్షల చెక్కులను మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అందజేశారు. అనంతరం అర్బన్‌డే సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులో 2కే. రన్ నిర్వహించారు. తూంకుంట, శామీర్‌పేటలోని వార్డుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రైసింగ్ తెలంగాణ పేరుతో నిర్వహించిన రంగోళి కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురేష్, హరిబాబు, మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఆర్ఐ భాస్కర్, ఇన్‌స్పెక్టర్ రేణుక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: తమ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మేడ్చల్‌లో కోటి 43లక్షలతో నిర్మిస్తున్న యూపీహెచ్‌సీ నిర్మాణ పనులకు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. కార్మికులకు బీమా బాండ్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


పోచారం విజయోత్సవ ర్యాలీలో చైర్మన్ కొండల్‌రెడ్డి


మహిళా సంఘాలకు చెక్కులను అందజేస్తున్న కమిషనర్ వెంకటగోపాల్


మేడ్చల్‌లో.. యూపీహెచ్‌సీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు


జవహర్‌నగర్‌లో.. విజయోత్సవ ర్యాలీలో మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు

మహిళల అభివృద్ధికి పెద్ద పీట

ఘట్‌కేసర్: మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ పావనీజంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు చెక్కులు, పీపీఈ కిట్లు పంపిణీ చేసి ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం, మెడికల్ క్యాంపు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ 6 గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు యూనిట్ల వినియోగించిన వారికి ఉచిత విద్యుత్ అందజేస్తుందని, రైతులకు రుణమాఫీ చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు నాగజ్యోతి, రవీందర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రదాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, నాయకులు అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ఆంజనేయులు యాదవ్, సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్, పారిశుద్ధ్య కార్మికులు, డ్వాక్రా మహిళలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పావనీజంగయ్య తదితరులు

రూ.40 లక్షలతో లేక్‌పార్క్ సుందరీకరణ



మల్కాజిగిరి: సఫిల్‌గూడ లేక్‌పార్క్ సుందరీకరణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సుమారు రూ.40 లక్షలతో ఎంట్రన్స్ ఆర్చ్‌తో పాటు పార్కు లోపల సుందరీకరణ పనులు జరుగుతాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేయాలని ఇంజినీరింగ్ విభాగం ఈఈ లక్ష్మణ్‌కు సూచించామన్నారు. పనులు పరిశీలించాల్సిన డీఈ మహేష్ హాజరుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల మధ్య సమన్వయం లేదన్నారు. గతంలో మేయర్‌తో పాటు అప్పటి కమిషనర్ ఆమ్రపాలి నోడల్ ఆఫీసర్‌గా మహేష్‌కు అప్పగించారని, వారు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

కుషాయిగూడ: వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రోడ్ల సమస్యలకు పరిష్కారం చూపాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమై ఇబ్బందులు పడుతున్నామంటూ.. కాలనీవాసులు వాపోయారు. కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టి శాశ్వత పరిష్కారం లభించేలా తగిన చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం చక్రిపురం కాలనీని సందర్శించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. ఏఈ స్వరూప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, నేతలు గోపాల్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, గంప కృష్ణ, ఈశ్వరయ్య, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

మల్లాపూర్: నాచారంకు చెందిన జూపల్లి అనుగ్రహ ఢిల్లీలో ఈనెల 9న జరగబోయే అండర్- 17 జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు బాక్సింగ్ అకాడమీ కోచ్ ఎం.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వరంగల్‌లో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జూపల్లి అనుగ్రహ గోల్డ్‌మెడల్ సాధించి, ఢిల్లీలో జరిగే బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది.

ఇందిరా పార్కుకు నాయీ బ్రాహ్మణులు

మల్లాపూర్: ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన నాయీ బ్రహ్మణహక్కుల కోసం నిర్వహించిన ధర్నాకు మంగళవారం మల్లాపూర్ నాయీ బ్రహ్మణుల సేవా సంఘం ఆధ్వర్యంలో తరలివెళ్లారు. అధ్యక్షులు వీరాస్వామి, ఉపాధ్యక్షులు పరుశురాం, సభ్యులు నాగరాజు, నర్సింహ, సురేష్, రవి, సత్తయ్య, కిష్టయ్య, తదితరులున్నారు.

ముడుపులు ముడితేనే .. అనుమతులు

- ఇంటి నిర్మాణ అనుమతి.. మ్యుటేషన్‌కు తప్పని వెతలు
- ప్రత్యేక సైట్ ఉన్నా.. ఇబ్బందుల్లో ప్రజలు
- సాంకేతిక సమస్యల సాకుతో దర్జాగా దందా
- పురపాలక సంఘాలు.. జీపీల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
- అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలక సంఘాలు గ్రామ పంచాయతీల్లో ఇంటి నిర్మాణ అనుమతులకు ముడుపులు చెల్లిస్తేనే దరఖాస్తు ముందుకు కదులుతోంది. మున్సిపాలిటీల్లో కంటే గ్రామ పంచాయతీల్లో ఈ పరిస్థితి హద్దులు దాటుతోందని తెలుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవల ప్రభుత్వం ఓఆర్‌ఆర్ లోపల ఉన్న 40 గ్రామ పంచాయతీలను పక్కనే ఉన్న 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. ఇక శివారు జిల్లాలలో 580 గ్రామ పంచాయతీలు మిగిలాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 546 గ్రామ పంచాయతీలు ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మేడ్చల్ జిల్లాలో మిగిలిపోయిన 34 పంచాయతీలను కూడా నాలుగు మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయాలన్న యోచనతో సర్కారు ఉన్నట్లు స్థానిక పంచాయతీల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అలాగే, శివారు జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 16 ఉండగా, మేడ్చల్ జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. పలు పురపాలక సంఘాలు, పంచాయతీల్లో ఇంటి అనుమతుల తోసహా మ్యుటేషన్లు తదితర పనులన్నీ ముడుపులు ముట్టజెప్పకుండా పరిష్కారానికి నోచుకోవటం లేదని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

ప్రతి పనికి ఓ రేటు..

శివారు జిల్లాలలోని పురపాలక సంఘాలతో సహా గ్రామ పంచాయతీల్లో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి అమలు చేస్తున్నా.. ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత జిల్లా అధికారుల పర్యవేక్షణ లేక పోవటంతో కొన్ని పంచాయతీల్లో వారి అక్రమాలకు హద్దు లేకుండా పోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి నిర్మాణ అనుమతులు మొదలుకొని, మ్యుటేషన్ల విషయంలో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌తోసహా పలువురు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణ అనుమతులతో పాటు ఇతరత్రా పర్మిషన్లు అన్నీ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. సిటిజన్ చార్టు ప్రకారం నిర్దేశిత గడువులోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు చేయాల్సి ఉంటోంది. తిరస్కరిస్తే కారణాలను దరఖాస్తుదారునికి వివరించాల్సి ఉంటోంది. ఇందుకు విరుద్ధంగా పురపాలక సంఘాలు, పంచాయతీల్లో ప్రతీపనికి కొంత ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో సంబంధిత సైట్ పలుమార్లు మొరాయిస్తోంది. దీన్ని సాకుగా చూపెట్టి పలువురు ఇంటి నిర్మాణ అనుమతులను మాన్యువల్‌గా జారీచేస్తున్నారు. ఆయా అనుమతుల ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సైతం వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటే పంచాయతీల్లో కూడా పట్టణాల్లో మాదిరిగా నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు చూపెడుతూ.. తిరస్కరిస్తున్నారు. పురపాలక సంఘాల్లో అయితే దరఖాస్తులో కావలసిన పత్రాలు లేవని తదితర కుంటి సాకులు చూపుతూ కాలయాపన చేస్తున్నారని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత, జిల్లా ఉన్నతాధికారులు స్థానికంగా జరిగే లోపాలు, అవినీతి, అక్రమాలపై దృష్టి సారించకపోవటంతో పలువురు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

కీసర: పనికి తగ్గ వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని కోరుతూ మంగళవారం కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. అధికారులు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆశా వర్కర్లను వినియోగించుకుంటున్నారని, కానీ ఆశా వర్కర్లకు మాత్రం ఖచ్చితమైన జీతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్లకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

శామీర్‌పేట్: ఆశా వర్కర్లకు లెప్రసి, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ శామీర్‌పేట మండల కార్యదర్శి కిష్టప్ప డిమాండ్ చేశారు. మంగళవారం శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 2 నుంచి లెప్రసి సర్వే చేయాలని జిల్లా అధికారులు ఆశా వర్కర్లుకు ఆదేశాలు జారీ చేశారని, పెండింగ్‌లో ఉన్న పల్స్‌పోలియో, లెప్రసి బిల్లులను చెల్లించిన తరువాతే సర్వే చేయించాలని కోరారు. శామీర్‌పేట మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.


శామీర్‌పేటలో.. నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

శ్రీకాంతాచారి ఆశయ సాధనకు కృషి

బోడుప్పల్: తెలంగాణ తొలి ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి ఆశయాలను కొనసాగిద్దామని శ్రీ గాయత్రి విశ్వకర్మ సంక్షేమ సంఘం బోడుప్పల్ అధ్యక్షులు భజ్జోజు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి అలుగోజు నర్సింహాచారి అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన శ్రీకాంతాచారి 15 వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఉప్పల్ శ్రీహరిచారి, సోమయ్య, రాములుచారి తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు